సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



కాంగ్రెస్, బీజేపీ.. అడ్డంకులు

అభివృద్ధికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే అడ్డంకులని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. - IIIలో



బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. - IIIలో



వాహన బారులు

దసరా సందర్భంగా హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగింది. - IIIలో

• సద్దుల సంబురం



సద్దుల బతుకమ్మ సందర్భంగా సోమవారం భువనగిరిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యాదగిరిగుట్ట పట్టణంలో బతుకమ్మ తీసుకువస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, మోత్కూరులో యువతి

• మహిషాసుర మర్ధినిగా..



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి శివాలయంలో మహిషాసుర మర్ధిని అలంకారంలో అమ్మవారు

న్యూస్‌రీల్

ప్రజలకు మంత్రి జగదీష్‌రెడ్డి శుభాకాంక్షలు



సూర్యాపేట: చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతం దసరా అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తెలిపారు. జిల్లా ప్రజలకు ఆయన విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా రోజున శుభసూచికంగా పాలపిట్టను దర్శించి, పవిత్రమైన జమ్మిచెట్టుకు పూజలు చేసే సంప్రదాయం గొప్పదని పేర్కొన్నారు. జమ్మి ఆకును బంగారంలా భావించి పంచుకుంటూ, పెద్దల ఆశీర్వాదాలు తీసుకుని, ప్రేమాభిమానాలను చాటుకోవడం దసరా పండుగ ప్రత్యేకత అని మంత్రి తెలిపారు. విజయానికి సంకేతమైన దసరా నాడు తలపెట్టిన కార్యాలన్నీ ఫలించాలని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో జీవించేలా ప్రజలను దీవించాలని కనకదుర్గమ్మ అమ్మవారిని మంత్రి ప్రార్థించారు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీలకు ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ పరిధిలో గల ఓంసాయి కాలనీకి చెందిన దివ్యాంగ క్రీడాకారిణి బాగిడి స్వప్న అంతర్జాతీయ త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. భారత్ జట్టు తరఫున తొమ్మిది మంది బాలికలు అంతర్జాతీయ పోటీలకు ఎంపికవగా అందులో స్వప్నకు చోటు దక్కింది. నవంబర్ 22 నుంచి 27 వరకు భూటాన్ రాజధాన్ని థింపూలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. ఈ పోటీల్లో విజయం సాధిస్తే 2024లో జరిగే వరల్డ్ సిరీస్‌లో ఆమెకు చోటు దక్కే అవకాశం ఉంది. ఈ పోటీల్లో పాల్గొనడానికి వెళ్లాలంటే రూ.56 వేల ఖర్చు కానుందని, దాతలు చేయూతనిస్తే జిల్లాకు పేరు తెస్తానని స్వప్న పేర్కొంది. ఆర్థికసాయం చేయదల్చిన దాతలు సెల్ 8297259445 నంబర్‌ను సంప్రదించాలని క్రీడాకారిణి వేడుకుంటోంది.

కచ్చీరు స్థలంపై హైకోర్టు స్టేటస్ కో- ఆర్డర్



వివరాలు వెల్లడిస్తున్న చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం

చౌటుప్పల్ : పట్టణంలోని కచ్చీరు స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు స్టేటస్ కో-ఆర్డర్ ఇచ్చిందని మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం తెలిపారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కచ్చీరు స్థలాన్ని తప్పుడు దస్తావేజులు సృష్టించి ఇటీవల విక్రయించారని గుర్తు చేశారు. స్థలాన్ని కాపాడాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. ఆ మేరకు హైకోర్టు ఈనెల 19న స్టేటస్ కో-ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్‌బాబు, గోపగోని లక్ష్మణ్‌గౌడ్, దండ హిమబిందుఅరుణ్‌కుమార్, న్యాయవాదులు తడక మోహన్, ఎండీ ఖయ్యూం, చిన్నకొండూర్ ఎంపీటీసీ చెన్నబోయిన వెంకటేశం, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



కొల్లూరులోని ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జనగాం ఉపేందర్‌రెడ్డి

ఆలేరురూరల్ : వరి కోతలు మొదలై 20 రోజులు కావస్తున్నా ఇంకా ధాన్యం కొనుగోలు చేయడం లేదని, వెంటనే ప్రారంభించాలని టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆలేరు మండలంలోని కొల్లూరులో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలకు ధాన్యం వెల్లువలా వస్తున్నా కేంద్రాలను ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రారంభించిన చోట కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ పేరుతో రైతులను ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రుణమాఫీ డబ్బులను బ్యాంకులు వడ్డీ కింద జమ చేస్తున్నాయన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఏక కాలంలో రూ.23వేల కోట్ల పంట రుణాలు మాఫీ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలలతో పార్టీ అధికారంలోకి రావడం ఖయమన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, దశరత, వెంకటేష్, మాజీ సర్పంచ్ శంకరయ్య, గణేష్, భిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాలుగే ఖరారు

ఉమ్మడి జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

- 8 నియోజకవర్గాల్లో ఇంకా తేల్చని కమలం పార్టీ
- ఆశావహులకు తప్పని ఎదురుచూపు
- మొదటి జాబితాలో రాజగోపాల్‌రెడ్డికి దక్కని చోటు



వెంకటేశ్వర్‌రావు



రామచంద్రయ్య



నారాయణ రెడ్డి



నివేదితరెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : భారతీయ జనతా పార్టీ నాలుగు స్థానాల్లోనే అభ్యర్థులను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాలకు గాను ఆదివారం నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కొన్ని రోజులుగా ఇదిగో.. అదిగో.. అంటూ ఉత్కంఠ రేపుతూ వచ్చిన అధిష్టానం ఆలస్యంగానైనా అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తుందని ఆశావహులు భావించారు. కానీ, నాలుగు చోట్ల మాత్రమే ప్రకటించడంతో మిగతా చోట్ల ఆశావహులకు నిరీక్షణ తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 52 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను బీజేపీ ఆదివారం ప్రకటించింది. అందులో ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో నాగార్జునసాగర్ నుంచి కంకణాల నివేదితరెడ్డి, సూర్యాపేట సంకినేని వెంకటేశ్వరరావు, భువనగిరి గూడూరు నారాయణరెడ్డి, తుంగతుర్తి కడియం రామచంద్రయ్య పేర్లను ఖరారు చేసింది.

ఆయనే పోటీచేస్తారా.. ?

మునుగోడులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతేడాది ఎమ్మెల్యే పదవి రాజీనామా చేసి, బీజేపీలో చేరడంతో గతేడాది ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో హోరాహోరిగా పోటీ జరిగింది. రాజగోపాల్‌రెడ్డి ఓడిపోయారు. ఇప్పుడు సాధారణ ఎన్నికల్లో పోటీలో ఉండేందుకు రాజగోపాల్‌రెడ్డి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయినా, బీజేపీ ప్రకటించిన మొదటి జాబితాలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చోటు కల్పించలేదు. దీంతో ఆయనే అక్కడి నుంచి పోటీచేస్తారా? ఆయన సతీమణిని పోటీలో దింపుతారా? అన్న చర్చ మొదలైంది. ఇదివరకు ఈ చర్చ ఉన్నప్పటికీ రాజగోపాల్‌రెడ్డినే పోటీలో ఉంటారని పార్టీ వర్గాలు చెబుతూ వచ్చాయి. ఇప్పుడు ఆయన పేరును మొదటి జాబితాలో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, బీజేపీ రెండో జాబితాను ఎప్పుడు ప్రకటిస్తుందనే చర్చ జరుగుతోంది. ఆ జాబితా ఎప్పుడు వస్తుంది.. ఆ అభ్యర్థుల ప్రచారానికి ఎంత సమయం ఉంటుందనే విషయాలను అధిష్టానం ఆలోచించడం లేదని ఆ పార్టీ వర్గాలే వ్యాఖ్యానించాయి.

• నివేదితకు మరోమారు అవకాశం

సాగర్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి కంకణాల నివేదితరెడ్డి 2018 ఎన్నికల్లో పోటీచేశారు. ఇప్పుడు మరోసారి పోటీలో ఉండబోతున్నారు. బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి సతీమణి కావడంతో ఆమెకు రెండోసారి టికెట్ దక్కింది.

• తొలిసారి పోటీలో..

భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గూడురు నారాయణరెడ్డి మొదటిసారి పోటీచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి, యువజన సంఘాల నాయకునిగా కొనసాగుతూ 2005 నుంచి 2020 వరకు ఏఐసీసీ సభ్యుని ఉన్నారు. పీసీసీ కోశాధికారిగా పని చేశారు. 2020లో బీజేపీలో చేరిన ఆయన ఇప్పుడు మొదటిసారిగా బీజేపీ నుంచి పోటీచేస్తున్నారు.

• మళ్లీ తుంగతుర్తి నుంచే..

తుంగతుర్తి నుంచి కడియం రామచంద్రయ్య బీజేపీ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేస్తున్నారు. 2018లో బీజేపీలో చేరిన ఆయన ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. ఇప్పుడు కూడా అక్కడి నుంచే పోటీ చేస్తున్నారు.

ఇంకా ఉత్కంఠ..

బీఆర్‌ఎస్ పార్టీ అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థులను ఆగస్టు 21వ తేదీనాడే ప్రకటించి ప్రచారంలో దూకుడు పెంచింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఆరు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో ముందుకు సాగుతోంది. బీజేపీ మాత్రం మొదటి జాబితాను ప్రకటించడంలో ఆలస్యం కావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. జాబితాను ఎప్పుడు ప్రకటిస్తుందోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు ఆదివారం ప్రకటించినా ఉమ్మడి జిల్లాలో నాలుగు పేర్లనే ప్రకటించడంతో మిగతా ఎనిమిది నియోజకవర్గాల్లోని అభ్యర్థుల్లో ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.

ఐదోసారి పోటీలో సంకినేని

అసెంబ్లీ ఎన్నికల్లో సంకినేని వెంకటేశ్వర్‌రావు ఐదోసారి పోటీ చేయబోతున్నారు. ఒకసారి తుంగతుర్తి నుంచి గెలుపొందిన ఆయన ఒకసారి అక్కడి నుంచే ఓడిపోయారు. సూర్యాపేటలో రెండుసార్లు ఓడిపోయారు.1999లో తుంగతుర్తి నుంచి టీడీపీ తరఫున పోటీచేసి గెలుపొందారు. 2004లో ఓడిపోయారు. 2009లో తుంగతుర్తి ఎస్సీ రిజర్వుడ్‌గా మారడంతో సూర్యాపేటకు వచ్చారు. అప్పుడు పోటీచేయాలని భావించినా మహాకూటమి పొత్తులో ఆ స్థానాన్ని టీఆర్‌ఎస్‌కు కేటాయించారు. 2014లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2018 ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేసి ఓడిపోయారు.

ఆశీర్వాద సభను జయప్రదం చేయాలి

• ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



ఆలేరులో సభా స్థలాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడుతున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆలేరు రూరల్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29న ఆలేరు పట్టణంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్నారని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి తెలిపారు. సభకు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆలేరులో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్న సాయిప్రశాంత్ వెంచర్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఈ మైదానం తమకు సెంటిమెంట్ అని, సభకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందన్నారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సభకు జన సమీకరణపై దృష్టి సారించామని, ఆలేరు నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 50వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ గెలిస్తేనే ఆలేరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఆలేరు పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం, నాయకులు మొరిగాడి వెంకటేష్, బాలస్వామి, పత్తి వెంకటేష్, కౌన్సిలర్లు బేతి రాములు, నర్సింహులు, జూకంటి శ్రీకాంత్, దయ్యాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆరాధన, నిజాభిషేకం, అర్చన తదితర పూజలు గావించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవలను ఊరేగించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తోడు దొంగలు

• మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: అవినీతికర, మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతూ తోడు దొంగలుగా వ్యవహరిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితబంధు, బీసీబంధు పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ఓట్ల పథకంగా మార్చిందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టించి పేదవాడికి ఇస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ఊరికొక కోడి ఇంటికో ఈక లాగా చేస్తున్నారన్నారు. బీజేపీ మతోన్మాద రాజకీయాలు చేస్తూ దేశ ప్రజలను విభజించి, దేశ సంపదను కొల్లగొట్టి బడా వ్యాపారులకు దోచి పెడుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, ధీరావత్ రవినాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈసీ మార్గదర్శకాలు పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్లు, పాల్గొన్న అధికారులు

• కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సాక్షి,యాదాద్రి : ఎన్నికల కమిషన్(ఈసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల అధికారులు, సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనిఖీల్లో పట్టుబడిన నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలన్నారు. స్వాధీనం చేసుకున్న బంగారం, నగదును జిల్లా ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు.వాటి విలువ రూ.10 లక్షల లోపు ఉంటే వెంటనే జిల్లా గ్రీవెన్ సెల్‌కు, అంతకంటే ఎక్కువ ఉంటే ఐటీ అధికారులకు అప్పగించాలని సూచించారు. సదరు నగదు, బంగారం కోసం సంబంధికుల నుంచి వచ్చే అప్పీల్లను గ్రీవెన్ సెల్, ఐటీ అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. కోడ్ ఉల్లంఘటనపై సీ-విజిల్ యాప్, కంట్రోల్‌రూమ్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కోరారు.

సభలు, ర్యాలీలకు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలి

సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి సువిధ యాప్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. 80 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి, దివ్యాంగులకు ఫారం–12 డి పంపిణీ చేయాలన్నారు. నూతన ఓటరు నమోదుకోసం వచ్చిన దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, నోడల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే 'లక్ష్యం'

- టెన్త్ పరీక్షలకు ప్రత్యేక కార్యాచరణ
- నవంబర్ 13 నుంచి స్టడీ అవర్స్, అభ్యసన కార్యక్రమాలు
- జిల్లాకు చేరిన దీపిక పుస్తకాలు
- 5,521 మంది విద్యార్థులు





గోదాములో అభ్యస, లక్ష్య ప్రణాళిక పుస్తకాలు, లక్ష్య పేరుతో రూపొందించిన పుస్తకం

భువనగిరి : వచ్చే సంవత్సరం ఏప్రిల్‌లో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా లక్ష్య పేరుతో అభ్యసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. నవంబర్ 13నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

ప్రణాళిక అమలు ఇలా..

- సబ్జెక్టుల వారీగా సూక్ష్మ ప్రణాళికలు అమలు చేస్తారు.
- ప్రత్యేక తరగతులు, బోధనతో పాటు అభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- వార్షిక పరీక్షలకు ముందు ఫిబ్రవరిలో ప్రీ ఫైనల్, గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తారు.
- విద్యార్థుల తల్లిదండ్రులకు పరీక్షల సన్నద్ధతపై అవగాహన కల్పిస్తారు.
- పదో తరగతి తర్వాత ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉంటాయనే విషయంపై వివరిస్తారు.

జిల్లాకు చేరిన పుస్తకాలు ఇలా..

జిల్లాలో 712 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో ఉన్నత పాఠశాలలు 170 ఉన్నాయి. వాటిలో పదో తరగతి విద్యార్థులు 5,521 మంది ఉన్నారు. వీరికి అందజేసేందుకు సుమారు 6 వేల పుస్తకాలు వచ్చాయి. లక్ష్య ప్రణాళిక పుస్తకాలు 1,170 వరకు వచ్చాయి. ఇవన్నీ జిల్లా కేంద్రంలోని గోదాము నుంచి మండల కేంద్రాలకు చేరవేశారు. దసరా పండుగ తర్వాత పాఠశాలల ప్రారంభం కాగానే ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందజేయనున్నారు.

వంద శాతం ఫలితాలు లక్ష్యం

పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర విద్యాశాఖ లక్ష్య పేరుతో ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. ఇందుకు సంబంధించి అభ్యస దీపిక పుస్తకాలు మండలాలకు సరఫరా చేశాం. దసరా తర్వాత పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు అందజేస్తాం. లక్ష్య కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయ్యింది. వీరికి కూడా అభ్యస దీపిక పుస్తకాలు అందజేస్తాం.

– నారాయణరెడ్డి, డీఈఓ































బీజేపీ అభ్యర్థుల బయోడేటా

భువనగిరి: గూడూరు నారాయణరెడ్డి

పుట్టినతేదీ: 26.02.1963, **తల్లిదండ్రులు:** గూడురు మంగారెడ్డి, భారతి
భార్య: పద్మావతిదేవి, **పిల్లలు:** ప్రియదర్శిని, శమంతిక, ప్రణయ్
విద్యార్హత: బీకాం, ఎల్ఎల్‌బీ
రాజకీయ ప్రస్థానం: 2005 నుంచి 2020 వరకు ఏఐసీసీ సభ్యుడిగా కొనసాగారు. 2020లో బీజేపీలో చేరారు.
సేవా కార్యక్రమాలు: 300 మంది పేద విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నారు. చేనేత కార్మికులకు ఆసు యంత్రాలు, రజకులకు ఇస్త్రీ పెట్టెలు, నాయీ బ్రాహ్మణులకు కిట్లతో పాటు 800 మంది పేద విద్యార్థులకు ఉచితంగా ఉద్యోగ శిక్షణ ఇప్పించారు.

నాగార్జునసాగర్: కంకణాల నివేదితరెడ్డి

పుట్టిన తేదీ: 12.05.1976, **తల్లిదండ్రులు:** నిర్మలాదేవి, జైహింద్‌రెడ్డి
స్వస్థలం: తిరుమలగిరి, పెద్దఅడిశర్లపల్లి మండలం
భర్త: కంకణాల శ్రీధర్‌రెడ్డి (బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు)
కుమార్తెలు: కావ్య, కీర్తి, **విద్యార్హత:** బీఎస్సీ (జనటిక్స్)
రాజకీయ నేపథ్యం: ఉన్నత విద్య పూర్తిచేసిన తర్వాత బాగ్ సంపర్క్ ప్రముఖ్, రాష్ట్రీయ సేవికా సమితి సభ్యురాలిగా, వీఎన్ఐటీ (విశ్వేశ్వరయ్య నేషనల్ ఇనిస్టిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), నాగపూర్ బోర్డు ఆఫ్ గవర్నింగ్ సభ్యురాలిగా, ఏబీవీపీతో పాటు మహిళా సమన్వయ ఆర్గనైజేషన్‌లో పనిచేశారు.

తుంగతుర్తి : కడియం రామచంద్రయ్య

పుట్టిన తేదీ: 4.6.1960, **తల్లిదండ్రులు:** కడియం వెంకయ్య, సోమక్క
భార్య: సరస్వతి, **కుమారులు:** కళ్యాణ్ చందర్, జైచంద్ర
స్వస్థలం: నాగారం, **విద్యార్హత:** ఎంఎస్సీ, బీఈడీ
ఉద్యోగం: మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ 2018లో రిటైరయ్యారు.
రాజకీయ ప్రవేశం: 2018లో బీజేపీలో చేరి తుంగతుర్తి ఎమ్మెల్యేగా పోటీ చేశారు.
సేవా కార్యక్రమాలు: 2008లో తన తల్లి పేరిట కడియం సోమక్క మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

సూర్యాపేట: సంకినేని వెంకటేశ్వరరావు

పుట్టిన తేదీ: 10.06.1963, **తల్లిదండ్రులు:** సంకినేని రామారావు, కమలమ్మ
భార్య: లక్ష్మి, **కుమారులు:** అరుణ్, వరుణ్
విద్యార్హత: 10వ తరగతి, **వృత్తి:** కాంట్రాక్టర్
రాజకీయ ప్రస్థానం: 1988లో టీడీపీలో చేరారు. 1999లో టీడీపీ నుంచి తుంగతుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు.

బతుకమ్మను పూల కవాతుగా జరుపుకోవాలి

నడిగూడెం: బతుకమ్మను పూల, స్త్రీల కవాతుగా జరుపుకుందామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నడిగూడెం మండల పరిధిలోని చెన్నకేశవాపురంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భ్రూణ హత్యలు, సామూహిక అత్యాచారాలు, రాజకీయ దాడులు దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్ లాంటి సంఘటనలు మహిళలనే లక్ష్యంగా చేసుకుని జరిగాయన్నారు. బహుజన బతుకమ్మ ఉత్సవమే కాదు ఉద్యమం అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొమ్మకంటి కొమరయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్సూర్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బెల్లి నాగరాజు, పలస యాదగిరి, అరుణ, పద్మ, సంధ్య, గంగ, రాజేశ్వరి పాల్గొన్నారు.

యాదాద్రీశుడి గోపురంలా బతుకమ్మ

యాదగిరిగుట్ట: పట్టణంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురం మాదిరిగా బతుకమ్మను తీర్చిదిద్దారు. దివంగత దొమ్మాట యాదగిరిరెడ్డి - భారతమ్మ దంపతులకు గుర్తుగా వారి కుటుంబ సభ్యులు దొమ్మాట లావణ్య, నాగమణి, స్వప్న, సౌజన్య ఆధ్వర్యంలో నాలుగు ఫీట్ల ఎత్తులో యాదాద్రి ఆలయ గోపురంలా తీరొక్క పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మ ఆకట్టుకుంది.


యాదాద్రీశుడి గోపురం మాదిరిగా తీర్చిదిద్దిన బతుకమ్మ

కాగా దొమ్మాట యాదగిరిరెడ్డి- భారతమ్మ దంపతులు 35 ఏళ్ల క్రితం దేవుళ్ల రూపంలో బతుకమ్మలను పేర్చడానికి శ్రీకారం చుట్టారు. ఆ సంప్రదాయాన్ని వారి కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్నారు. వీరిని చూసి యాదగిరిగుట్ట పట్టణవాసులు కూడా దేవుళ్ల రూపంలో బతుకమ్మలను తీర్చిదిద్దుతున్నారు.

యాదాద్రిలో తగ్గిన భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: దసరా పండుగ నేపథ్యంలో ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లడంతో యాదాద్రి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. దీంతో స్వామి వారి ధర్మదర్శనానికి సుమారు గంట, వీఐపీ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. నిత్య కల్యాణంతో పాటు వివిధ పూజలో భక్తులు తక్కువగానే కనిపించారు. ఆయా పూజలతో స్వామి వారికి నిత్యాదాయం రూ.22,94,877 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.





ఘనంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణతంతు చేపట్టారు. ముందుగా విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ గావించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈఓ నవీన్ పాల్గొన్నారు.















